క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మంది వాహనదారులను అదుపులోకి తీసుకొని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 8 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించగా మరో ఇద్దరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

సంగారెడ్డి టౌన్‌లో...

సంగారెడ్డి టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన ఏడుగురిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఉద్యోగం నుంచి తొలగించండి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించిన అదనపు సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయబాబును ఉద్యోగం నుంచి తొలగించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి అన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకొని విజయబాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. సంగారెడ్డి మున్సిపాలిటీలో అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అకారణంగా తొలగించడం బాధాకరమన్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబును ఉద్యోగం నుంచి తొలగించకపోతే ఈ నెల 16 నుంచి విధులు బహిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రభువు, కిరణ్, రమేష్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

ఖేడ్ మున్సిపల్ కమిషనర్ బదిలీ

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పురపాలక సంఘం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జగ్జీవన్‌ను నారాయణఖేడ్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ




విద్యార్థులకు షీల్డులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

జిన్నారం(పటాన్‌చెరు): కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిన్నారంలోని ప్రతిభా విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభా విద్యానికేతన్ పాఠశాలకు చెందిన లోహిత్‌కుమార్, లాస్య, అక్షయ, ప్రశాంత్ ఉత్తమ ప్రతిభను కనబర్చారు. దీంతో కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ కంటేశ్వర్, నరేష్ చేతుల మీదుగా విద్యార్థులకు మంగళవారం షీల్డ్స్, మెడల్స్, సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ సారా శ్రీనివాస్ అభినందించారు. విద్యార్థులకు కుంగ్‌ఫూలో శిక్షణ ఇచ్చిన నరేష్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్నసీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పుష్పనగేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో దశలవారీగా పనులు చేపడతామన్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని కల్వకుంటలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ ఫర్హీన్ షేక్ ఆధ్వర్యంలో మంగళవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూమిలో ఎవరైనా ప్లాట్లు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మురుగు కూపం.. జనానికి శాపం

- చెత్తాచెదారంతో నిండిన బోప్పన్‌పల్లి చెక్‌డ్యాం
- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు, స్థానిక ప్రజలు
- పట్టించుకోని అధికారులు



మురుగునీటితో నిండిపోయిన చెక్‌డ్యాం

ఝరాసంగం(జహీరాబాద్): కురిసిన వర్షంనీరు వృథా పోకుండా భూగర్భజలాలు పెంపొందించాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన చెక్‌డ్యాం పూర్తిగా మురుగు కూపంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఝరాసంగం మండల కేంద్రం నుంచి బోప్పన్‌పల్లి గ్రామానికి సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాంలోకి చెత్తాచెదారంతో పాటు మురుగునీరు చేరడంతో పరిసరాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి.

గుంపులుగా పందుల సంచారం

బోప్పన్‌పల్లి గ్రామంలోని మురుగునీటితో పాటు ఝరాసంగంలోని మహాత్మాజ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయ సంస్థ నుంచి వృథా నీటిని, డ్రైనేజీ నీటిని(వ్యర్థాలు) చెక్‌డ్యాంలోకి వదులుతున్నారు. దీంతో పందులు, దోమల బెడద అధికమవడంతో అనారోగ్యాల బారిన పడుతూ ఆస్పత్రుల పాలవుతున్నామని విద్యార్థులు, గ్రామస్తులు వాపోతున్నారు.

ఇష్టానుసారంగా చెత్తాచెదారం పారబోత



గురుకుల పాఠశాల ఎదురుగా రోడ్డు పక్కనే వేసిన చెత్తాచెదారం

మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల విద్యాలయం సమీపంలో చెత్తచెదారం, పాడైన కూరగాయలు పాఠశాల ఎదురుగానే ఇష్టానుసారంగా పారబోసి చెత్తను తగులబెడుతున్నారు. దీంతో పాఠశాల ఆవరణలోని రాగానే ముక్కు మూసుకుని పోవాల్సిన పరిస్థితి నెలకొందని ఝరాసంగం, బోప్పన్‌పల్లి, బోరెగాం, జీర్లపల్లి, ప్యారవరం, ఇస్లాంపూర్‌తో పాటు తదితర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో దుర్వాసన మరింత ఎక్కువగా వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు వెంటనే స్పందించి చెక్‌డ్యాంలోకి డ్రైనేజీ నీరు వదలకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యంతో రైతుల హర్షం

పంట ఉత్పత్తుల రవాణాకు తీరిన ఇబ్బందులు



పానాది గుండా నిర్మించిన నూతన రోడ్డు

నారాయణఖేడ్: వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు నూతనంగా రోడ్డు నిర్మించడంతో అధికశాతంగా ఉన్న పేద రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖేడ్ మండల పరిధిలోని హుంగ్రానా(జి) గ్రామ పేదలు, దళితులకు చెందిన వ్యవసాయ భూములు మనూరు మండలంలోని కమలాపూర్, తదితర గ్రామాల శివారు వరకు ఉన్నాయి. కానీ.. పంట పొలాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అనాదిగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను పొలాల నుంచి తీసుకురావడానికి అష్టకష్టాలు పడేవారు. ఇదే మార్గంలో ఉన్న పానాది పక్క నుంచి కొంతమేర తమ భూములను రోడ్డు విస్తరణకు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. దీంతో రైతులు, గ్రామపెద్దల కోరిక మేరకు తాజా మాజీ సర్పంచ్ కృషితో ఇటీవల రూ.5లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో గ్రామ సమీపంలోని ఖేడ్‌-కంగ్టి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పానాది గుండా కమలాపూర్ శివారు వరకు నూతనంగా రోడ్డును నిర్మించారు. ఇదే మార్గంలో సయ్యద్ శాదుల్లా దర్గా సైతం ఉంది. రోడ్డు సదుపాయం ఏర్పడటంతో దీర్ఘకాలంగా రహదారి కోసం పడిన తమ బాధలు తొలిగాయని స్థానిక ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీహరికి జాతీయ అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న శ్రీహరి

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బేకరీ శ్రీహరికి స్వామి వివేకానంద ఐకాన్ జాతీయ అవార్డును అందజేశారు. వివిధ రంగాలకు సంబంధించిన జర్నలిజం, కూచిపూడి, కళాకారులు, సామాజికసేవ వంటి వివిధ రంగాల్లో వారివారి నైపుణ్యాన్ని గుర్తించిన గోల్డెన్ స్టార్ యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థాపకులు బింగి నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభ కళానిలయంలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ ఢిల్లీ ప్రతినిధి డాక్టర్ వేణుగోపాలచారి, హైకోర్టు సీనియర్ న్యాయవాది అభినయశ్రీ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ సుధాకర్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): నూతన ఎంపీడీఓగా సుధాకర్‌ను మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన సుజాత నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నల్గొండ జిల్లా నుంచి సుధాకర్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ విఠోబా, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, శివశంకర్, ధనరాజ్, రాజ్ కుమార్ కలిసి ఎంపీడీఓ సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు.



ఎంపీడీఓ యాదగిరిగౌడ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు ఎంపీడీవోగా యాదగిరిగౌడ్..

పటాన్‌చెరు టౌన్: నూతన మండల అభివృద్ధి అధికారిగా యాదగిరిగౌడ్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎంపీడీవో బన్సీలాల్ రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండల ఎంపీడీవోగా బదిలీపై వెళ్లగా నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన యాదగిరిగౌడ్ బదిలీపై పటాన్‌చెరు మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు ఆయనను సన్మానించారు. ఎంపీఓ హరిశంకర్‌గౌడ్, సూపరింటెండెంట్ వెంకటేశం, శ్రీనివాస్, శ్రీధర్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రిజ్వాన్, ప్రవీణ్, రాజేందర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: రాబోయే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ అన్నారు. ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా సీఐటీయూ నాయకులు పట్టణంలోని శ్రామిక్ భవనంలో మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్ తీసుకురావడంతో కోట్లాది మంది ప్రయోజనాలను కొంతమంది పెట్టుబడిదారులకు తాకట్టుపెడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో మహీంద్ర అండ్ మహీంద్ర, రాక్‌వూల్, సీఐ ఆటోమోటివ్ తదితర పరిశ్రమల సీఐటీయూ నాయకులు రాజిరెడ్డి, ఎల్లప్ప బాలరాజు శివరామరావు సందీప్‌రెడ్డి, మొగులయ్య పాల్గొన్నారు.

కంది(సంగారెడ్డి): కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా మండల పరిధిలోని చెర్లగూడెం, తోపుగొండ, చేర్యాలలో సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసేవిధంగా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లయ్య, నరేందర్, మల్కయ్య, రాజమల్లయ్య, కిరణ్ పాల్గొన్నారు.

సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని మంగళవారం శ్రామిక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రైతుల నల్లచట్టాలను తీసుకువచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వాజిద్‌అలీ, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా సుభాష్, మండల విద్యాధికారిగా అంజలి, జిల్లా విద్యాధికారిగా మీనా, కలెక్టర్‌గా కల్యాణి, విద్యాశాఖ మంత్రిగా అయేషా ఫాతిమా, ఎమ్మెల్యేగా సంతోష్‌కుమార్ తమ తమ విధులను నిర్వర్తించగా ఉపాధ్యాయుల దీక్షిత, భాగ్యశ్రీ, జ్యోతిప్రభ, సతీష్, హరీష్, ఈశ్వర్, అటెండర్లుగా రాంచరణ్, నరేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట భాస్కర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



హత్నూరలో...

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సికిందలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో స్వయంపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా కీర్తన, డీఇఓగా రాణి, ఎంఈఓగా వినయ్, విద్యాశాఖ మంత్రిగా భవాని వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, గిరిబాబు, రమేష్ దయానందరెడ్డి రమేష్, చంద్రయ్య, అనిత, మైపాల్‌రెడ్డి, గ్రామపెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రేమికుల రోజునే.. పెళ్లి బాజాలు



నరోత్తం, అనూష

జహీరాబాద్ టౌన్: పట్టణానికి చెందిన నరోత్తం, అనూషలు ప్రేమించుకున్నారు. 2012 నుంచి ఇద్దరు కలిసి చదువుకున్నారు. వీరిద్దరు పెళ్లి చేసుకోవాలనుకున్నారు. పెద్దలను ఒప్పించి ప్రేమికుల రోజు ఫిబ్రవరి 14న వరుడు ఇల్లు హౌసింగ్ బోర్డు కాలనీలో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

వాహనాల తనిఖీ

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారి బుదేరా సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుదేరా ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ డంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం తప్పదన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన పేపర్స్ ఉండాలని సూచించారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం



రక్తదానం చేస్తున్న యువకులు

సంగారెడ్డి: బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం బాల బ్రహ్మచారి సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్ కుమార్, మలక్‌పేట్ ఎక్సైజ్ సీఐ గోపాల్‌నాయక్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్, రాథోడ్ రామచందర్‌నాయక్, రాజేందర్‌నాయక్, ఫుల్‌సింగ్, ప్రకాష్‌నాయక్ నాయక్, మోహన్‌సింగ్, రవి, శివాజీ, గోపాల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ..

వ్యక్తికి తీవ్ర గాయాలు



వట్‌పల్లి(అందోల్): ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన అందోలు మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గ్ మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య జోగిపేటలో తన పనులను ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో అన్నసాగర్ గ్రామ సమీపంలోని మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లక్ష్మయ్య బైక్‌ను ఢీకొట్టింది. దీంతో లక్ష్మయ్య కుడికాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీ మండల అధ్యక్షుడిగా దుర్గయ్య

జహీరాబాద్ టౌన్: బీజేపీ జహీరాబాద్ మండల అధ్యక్షుడిగా ఎంజీ దుర్గయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నియామకం పత్రాన్ని అందచేశారు. మండల అధ్యక్షుడిగా నియమితులైన దుర్గయ్యను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం నర్సింహులు, రాష్ట్ర సలహాదారులు కృష్ణ, సభ్యులు ఉల్లిగడ్డ వెంకట్, బెండి శివకుమార్, మల్లేష్, హరీశ్ పాల్గొన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): భారతీయ జనతా పార్టీ కల్హేర్ మండల అధ్యక్షుడిగా బీబీపేట్ గ్రామానికి చెందిన యెన్నం అనిల్‌రెడ్డి నియమితులయ్యారు. అనిల్‌రెడ్డి గతంలో ఏబీవీపీ సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా పనిచేశారు. తన నియామకానికి సహకరించిన వారికి ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.


జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన జగన్‌రెడ్డిని మంగళవారం ఆ పార్టీ నాయకులు జిన్నారంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండల బీజేపీ అధ్యక్షుడిగా ఓంకార్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఓంకార్ యాదవ్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నియామక పత్రం అందజేశారు.

◆ కార్పొరేటర్‌కు సన్మానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్‌గా మెట్టు కుమార్ యాదవ్ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంగళవారం పటాన్‌చెరులోని సీతారామపురం కాలనీవాసులు, ఏక్తా 86 బృందం, బండ్లగూడ కాలనీవాసులు కుమార్‌యాదవ్‌ను తన నివాసంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా కాలనీవాసులు, యువకులు పాల్గొన్నారు.

◆ దిగ్వాల్ పాఠశాల జిల్లాలోనే టాప్



కోహీర్(జహీరాబాద్): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా దిగ్వాల్ ప్రభుత్వోన్నత పాఠశాల జిల్లాలోనే మంచి పేరు ప్రతిష్టలు సాధిస్తున్నదని ఎంఈఓ శంకర్ తెలిపారు. మంగళవారం దిగ్వాల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగ్వాల్ పాఠశాల కొన్ని సంవత్సరాలుగా వందశాతం ఉత్తీర్ణతతో పాటు మంచి జీపీఏ సాధిస్తోందని తెలిపారు. పాఠశాలలో పదో తరగతిలోనే 133 మంది ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ క్రీడాసామగ్రి పంపిణీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని చందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం మ్యాజిక్ స్పోర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దండు అంజయ్య, మండల నోడల్ అధికారి రుద్రప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్, మ్యాజిక్ స్పోర్ట్స్ సంస్థ ప్రతినిధులు అమిత్ రాజ్, రాజశేఖర్, సీఆర్పీలు రాజేశ్వర్, మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

మునిపల్లి(అందోల్): ప్లాస్టిక్ వినియోగంపై ఎంపీడీఓ హరినందన్‌రావు మండలంలోని బుదేరా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేయని జూట్ బ్యాగ్‌లను వినియోగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలోని భవానిస్పటిక లింగేశ్వర స్వామి ఆలయ ద్వాదశి వార్షికోత్సవాలను ఈ నెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని సూచించారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఆలయ వార్షికోత్సవంలో పాల్గొనాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఆహ్వానపత్రికలు అందజేసిననట్లు సర్పంచ్ వెంకటేశం ఎంపీటీసీ గుంటమీది వీరేశం, సొసైటీ డైరెక్టర్ దుర్గం గౌడ్, నాయకులు సుధాకర్‌రెడ్డి తెలిపారు.

◆ మానవ అస్థిపంజర అవయవాలు లభ్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మానవ అస్థిపంజర అవయవాలు లభ్యమైన సంఘటన మండల పరిధిలోని నందికంది గ్రామ శివారులో చోటుచేసుకుంది. సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నందికంది జాతీయ రహదారి రోడ్డు పక్కన బీడు భూమిలో గుర్తు తెలియని మానవ అస్థిపంజరం అవయవాలు లభ్యమయ్యాయి. సదాశివపేట ఆర్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం తెలిస్తే 8712656721నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

◆ సీఐకి సన్మానం



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం సీఐగా బాధ్యలు చేపట్టిన సుధీర్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యవంతమైన జీవితం



హెల్త్‌క్యాంపులో పాల్గొన్న ఆయుర్వేద వైద్యులు

సంగారెడ్డి అర్బన్: ప్రకృతిలో లభించే అనేక వనమూలికలతో ఆయుర్వేదంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని నర్మదా హోమియో, డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ సమీరా యునాని అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇమ్యూనిటీ బూస్టర్‌పై మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వకాలం నుంచి ప్రపంచానికి ఆయుర్వేదం, యునాని, సిద్ధ, యోగా వంటి వాటిని పరిచయం చేసింది భారతదేశమేనని తెలిపారు. ప్రకృతికి సంబంధం కలిగిన ప్రతిదీ మన ఆరోగ్యానికి మేలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, వెంకటేశం, వృక్షశాస్త్ర అధ్యాపకులు సిద్ధులు, పద్మజ, రాజు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.